'కంది'పోయిన రైతు

- భారీ వర్షాలకు దెబ్బతిన్న పంట
- పెట్టుబడి రాని పరిస్థితులు
- అన్నదాతల ఆందోళన



జహీరాబాద్ మండలం బూచినెల్లి పరిధిలో దెబ్బతిన్న కంది పంట

జహీరాబాద్ టౌన్: ఈ సంవత్సరం వ్యవసాయం రైతులను ఊరించి చివరకు ఉసూరు మనిపించింది. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన కంది పంట ప్రారంభంలో అబ్బా అనిపించింది. పూత, కాత దశ సమయంలో భారీ వర్షాలు కురవడంతో బాగా దెబ్బతింది.ఈ ఏడాదైనా లాభాలు గడించవచ్చని ఆశపడిన అన్నదాతలకు నిరాశ మిగిల్చింది. పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేక నష్టపోవాల్సి వస్తుంది.

జహీరాబాద్ వ్యవసాయ డివిజన్ పరిధిలోని జహీరాబాద్, మొగుడంపల్లి, న్యాల్‌కల్, కోహీర్, ఝరాసంగం మండలాల్లో నీటి వనరులు లేవు. బోరు బావులు కలిగిన రైతులు చెరకు, అల్లం, ఆలు సాగు చేస్తుండగా మిగతా రైతులు వర్షాధార పంటలను పండిస్తుంటారు. జహీరాబాద్ డివిజన్‌లో సుమారు 1.95 లక్షల ఎకరాల్లో రైతులు ఖరీఫ్ పంటలు వేశారు. 95 ఎకరాల్లో పత్తి, 45 వేల ఎకరాల్లో కంది, 45 ఎకరాల్లో సోయాబీన్, 6,600 ఎకరాల్లో మినుము, 11 వేల ఎకరాల్లో పెసర పంటను వేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చాలామటుకు పంటలు దెబ్బతిన్నాయి. పెసర, మినుము కోత దశలో ఉన్నప్పుడు వానలు పడటం వల్ల పంట చేతికి రాకుండా పోయాయి. పత్తి, కంది పంట కూడా చాలా వరకు దెబ్బతిన్నాయి. ప్రారంభంలో కంది పంట ఆశాజనకంగా ఉంది. ఏపుగా పెరగడంతో మంచి దిగుబడి వస్తుందని రైతులు ఆశపడ్డారు. పూత, కాత సమయంలో భారీ వర్షాలు అన్నదాతల ఆశలపై నీళ్లు చల్లింది. ఎడతెరపిలేకుండా కురిసిన వానలకు పూత, పిందెలు రాలిపోయాయి. పంట కూడా ఎండిపోతుంది. దానికి తోడు చీడ పీడలు మరో పక్క రైతుల పాలిట శాపంగా మారాయి. దెబ్బతిన్న పంటలను పరిశీలించి పరిహారం ఇవ్వాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కోలుకోలేని దెబ్బ

"కౌలుకు పొలం తీసుకుని ఐదు ఎకరాల్లో కంది పంట వేశా. లక్ష వరకు పెట్టుబడులు పెట్టా. ప్రారంభంలో పంట ఆశాజనకంగా ఉంది. మంచి దిగుబడి వస్తుందని ఆశపడ్డా. ఇటీవల కురిసిన భారీ వానల వల్ల కంది పంట మొత్తం దెబ్బతింది. ఎకరానికి 10 కిలోలు కూడా వచ్చే పరిస్థితి లేదు. వర్షాలు కోలుకోలేని దెబ్బతీశాయి."

–నాగేశ్వర్‌రావు,
కౌలు రైతు, జహీరాబాద్

ఎంపీ, ఎమ్మెల్యేలకు సన్మానం



నారాయణఖేడ్: ఎంపీ, ఎమ్మెల్యేలను సన్మానించిన ప్రకాష్ రాథోడ్

నారాయణఖేడ్: ఖేడ్‌లో శుక్రవారం జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డిలను జిల్లా అభివృద్ధి కో–ఆర్డినేషన్, మానిటరింగ్ కమిటీ సభ్యులుగా నియమితులైన ప్రకాష్ రాథోడ్ శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. పదేళ్లుగా ప్రజలు, గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం తాను చేసిన పోరాటాలు, ఉద్యమాలు, సేవలను గుర్తించి తనకు పదవినిచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ పదవికి న్యాయం చేస్తానని తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

– ఎమ్మెల్యే సునీతారెడ్డి



క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీత

హత్నూర(సంగారెడ్డి): ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. శుక్రవారం హత్నూర మండలం నస్తిపూర్ స్థానిక గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలు పురుషులతో సమానంగా వ్యాపార వాణిజ్య రంగాల్లో రాణించాలన్నారు. ప్రభుత్వం అందించే ప్రతీ ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నస్తీపూర్ మహిళా గ్రామైఖ్య సంఘం జిల్లాకే ఆదర్శంగా అన్ని కార్యక్రమాల్లో ముందుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు డీఆర్డీఓ జంగారెడ్డి, డీపీఎంలు జయశ్రీ, ఎంపీడీఓ శంకర్, మాజీ ఎంపీపీ నర్సింలు, ఏపీఎం దేవేందర్, సీసీలు కిష్టయ్య, మహేశ్, కల్పన, సావిత్రీ, పద్మవేణి మండల సమాఖ్య అధ్యక్షులు సుశీల, కార్యదర్శి సుమలత, గ్రామ అధ్యక్షులు సువర్ణ, వీఓఏ ప్రవీణ్, నాయకులు నర్సింహారెడ్డి, రామచంద్రారెడ్డి, మధు, శేఖర్ గౌడ్, లక్ష్మీనారాయణ, అర్జున్, సురేశ్, శ్రీకాంత్, అజ్మత్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా షాబుద్దీన్ తుర్కి ఉర్సు





దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎంపీ సురేశ్ షెట్కార్, మాజీమంత్రి చంద్రశేఖర్, ఎమ్మెల్యే మాణిక్‌రావు

పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే

జహీరాబాద్: మండలంలోని శేఖాపూర్ గ్రామంలో హజ్రత్ షేక్ షాబుద్దీన్ తుర్కి ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గురువారం అర్ధరాత్రి ఉత్సవాలు ప్రారంభమై శుక్రవారం అర్ధరాత్రి వరకు కొనసాగాయి. గురువారం రాత్రి నిర్వహించిన ఖవ్వాలీని ఆసక్తితో తిలకించారు. ఉత్సవాలలో జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, సెట్విన్ చైర్మన్ ఎస్.గిరిధర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్, ఐడీసీ మాజీ చైర్మన్ ఎం.డి.తన్వీర్, జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డిలు పాల్గొని దర్గాను దర్శించుకున్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కిజన్ యాపై, మచ్చేందర్, తట్టు నారాయణ, హీరూ రాథోడ్, విజేందర్‌రెడ్డి, మహబూబ్‌ఖాన్, అజీం, చిన్నారెడ్డి, బాబు, కాంగ్రెస్ నాయకులు జావీద్‌అలీ, ఎం.జి.రాములు, మక్సూద్, అర్షద్ పాల్గొన్నారు.

ఖేడ్‌లో స్వచ్ఛతహీ సేవ

నారాయణఖేడ్: మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులు స్వచ్ఛతహీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. శానిటరీ అధికారి శ్రీనివాస్ స్వచ్ఛత, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, తడి, పొడి చెత్తను వేరుచేసి మున్సిపాలిటీ చెత్త సేకరణ ఆటోల్లో వేసే విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు ప్రదర్శనగా స్థానిక ఆక్సీజన్ పార్కుకు వెళ్లి అక్కడ చెత్తను తొలగించి స్వచ్ఛత పనులు నిర్వహించారు.

రోడ్డును తవ్వి వదిలేశారు

12 రోజులు గడుస్తున్నా పట్టించుకోరా..?



రోడ్డు మధ్యలో తవ్వి వదిలేసిన దృశ్యం

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డి పట్టణంలోని ఎర్ర కుంటలో నిర్మించిన పలు కాలనీలు నీట మునగడంతో వరద నీరు కిందికి వదలటానికి ఈనెల 8వ తేదీన మల్కాపూర్ ఎక్స్ రోడ్ నుంచి రాజంపేట వెళ్లే రోడ్డును మధ్యలో తవ్వేశారు. అయితే.. 12 రోజులు గడుస్తున్నా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టే వారు కరువయ్యారు. నిత్యం ఈ రోడ్డు మార్గం గుండా వాహనదారులు స్కూల్ బస్సులు తిరుగుతూ ఉంటాయి, రోడ్డును పూడ్చకపోవడంతో ఈ మార్గం గుండా నివసిస్తున్న కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆక్రమణలు పాల్పడిన వారికోసం సామాన్యులకు ఇబ్బందులు కలుగజేస్తారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతున్నారు.

ఉపాధి పనుల తనిఖీ

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను శుక్రవారం సామాజిక తనిఖీ నిర్వహించినట్లు ఏపీఓ బస్వరాజ్ తెలిపారు. పోచాపూర్, సంగెం, రూప్లతండా, సూర్య తండా పంచాయతీలో జరిగిన ఉపాధి పనులు, నిధుల ఖర్చుపై డీఆర్‌పీలు తనిఖీ చేసినట్లు తెలిపారు.

మాణయ్య సేవలు మరువలేనివి

కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రాజిరెడ్డి



మాణయ్య విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న రాజిరెడ్డి, ఆంజనేయులుగౌడ్

హత్నూర(సంగారెడ్డి): కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కీర్తి శేషులు మాణయ్య సేవలు మరవలేనివని పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్‌లు కొనియాడారు. శుక్రవారం మాణయ్య వర్ధంతి సందర్భంగా హత్నూర మండలం లింగాపూర్ గ్రామంలో ఆయన విగ్రహానికి పార్టీ నాయకులు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుడిగా టీచర్ల సమస్యలపై పోరాటం చేసిన మహనీయుడు మాణయ్య అన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు సోమన్నగారి రవీందర్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సుజాత సత్యం, పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణ, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడుదాం

- 23న దేశవ్యాప్త బ్లాక్ డే
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు



దౌల్తాబాద్‌లో మాట్లాడుతున్న సాయిలు

హత్నూర(సంగారెడ్డి): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ ఈ నెల 23న చేపట్టే దేశవ్యాప్త బ్లాక్ డే నిరసన కార్యక్రమానికి పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొనాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి సాయిలు అన్నారు. శుక్రవారం హత్నూర మండలం దౌల్తాబాద్‌లో సంఘం నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకు వచ్చిన కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ 23న కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త బ్లాక్ డే ను పెద్ద ఎత్తున విజయవంతం చేసేందుకు కార్మికులు సిద్ధం కావాలన్నారు. జిల్లా, మండల, పట్టణ పారిశ్రామిక కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మిక వర్గ హక్కులను విదేశీ స్వదేశీ పెట్టుబడుదాలకు కట్టబెట్టిందన్నారు. దీంతో కార్మిక వర్గానికి తీవ్ర నష్టం చేసిందన్నారు. బ్లాక్ డేలో కార్మికులు వేలాదిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు విద్యాసాగర్, వివిధ యూనియన్ల నాయకులు షబ్బీర్, వీరేశం, రాజు, గోపాల్, సంగమేశ్, నర్సింహులు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో హిందీ భాషా దినోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిందీ భాషా దినోత్సవాలు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 7 నుంచి హిందీ వారోత్సవాలు ప్రారంభం నేపథ్యంలో విద్యార్థులకు వ్యాసరచన, పాటలు, రంగోలి పోటీలు నిర్వహించారు. చివరి రోజు శుక్రవారం ముగింపులో భాగంగా కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ విద్యార్థులకు హిందీ భాష ప్రాముఖ్యతను వివరించారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకురాలు పూనంకుమారి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు ప్రక్రియపై సంతృప్తి



నారాయణఖేడ్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పరిశీలకులు

నారాయణఖేడ్: ప్రత్యేక ఓటరు నమోదు– 2025 కార్యక్రమాన్ని పరిశీలించేందుకు హైదరాబాదు సీఈఓ కార్యాలయం నుంచి పరిశీలకులు శ్రీకాంత్, నీలిమ శుక్రవారం నారాయణఖేడ్‌కు వచ్చారు. బీఎల్‌వోల ద్వారా చేపట్టిన ఇంటింటి సర్వే తీరును పట్టణంలోని ఓ ఇంటికి వెళ్లి పరిశీలించారు. కొత్తఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియకు సంబంధించి స్థానిక రెవిన్యూ డివిజన్ కార్యాలయంలో రిపోర్టులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్డీఓ అశోకచక్రవర్తితో కలిసి బీఎల్‌వోలతో సమావేశాన్ని నిర్వహించి తగిన సూచనలిచ్చారు. అనంతరం పట్టణంలోని 167 నంబరు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. వారి వెంట స్థానిక తహసీల్దార్ భాస్కర్, డిప్యూటీ తహసీల్దారు రాజుపటేల్, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ మాధవరెడ్డి ఉన్నారు.

పటాన్‌చెరులో..

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు నియోజకవర్గంలో ఎస్ఎస్ఆర్– 2025 ప్రత్యేక ఓటరు జాబితా సవరణ పరిశీలనకు శుక్రవారం హైదరాబాద్ ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి ప్రత్యేక బృందం పరిశీలనకు వచ్చింది. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ, ఇంటింటా సర్వేలో భాగంగా జాబితాను పరిశీలించారు. పటాన్‌చెరు తహసీల్దార్ కార్యాలయంలో సీఈవో కార్యాలయ తహసీల్దారు శ్రీకాంత్ రావు, డిప్యూటీ తహసీల్దార్ నీలిమల బృందం ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం, నియోజకవర్గం పరిధిలోని తహసీల్దార్లతో సమావేశమయ్యారు. అనంతరం జీహెచ్‌ఎంసీలో పోలింగ్ బూత్‌లను పరిశీలించి అక్కడి బీఎల్‌ఓ అనితను పోలింగ్ జాబితాకు సంబంధించి,ఎస్ ఎస్ఆర్ –2025, హెచ్2 హెచ్ సర్వే గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఓటరు నమోదు అధికారి దేవుజా, తహసీల్దార్లు రంగారావు, భిక్షపతి, గంగాభవాని, రాధా, సంగ్రామ్‌రెడ్డి, డీటీ సంతోష్ కుమార్, బీఎల్‌వో అనిత తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

సంగారెడ్డి టౌన్: వ్యక్తి అదృశ్యమైన ఘటన సంగారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అస్సాం రాష్ట్రం అయిన ఖల్ గ్రామం చెందిన వ్యక్తి బతుకుదెరువు కోసం సదాశివపేట పట్టణంలో ఉంటున్న అదే రాష్ట్రానికి చెందిన సందీప్ రి వచ్చాడు. అతడి వద్దే ఉంటూ పనులు చేసుకొని జీవనం కొనసాగిస్తున్నాడు. 11న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కే సమయంలో బిష్ణు రి తప్పిపోయాడు. ఎక్కడ వెతికిన కనిపించకపోవడంతో శుక్రవారం సంగారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్‌లో సందీప్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

స్పోర్ట్స్' యూనిఫామ్ కోసం నగదు అందజేత



నగదు అందజేస్తున్న కార్పొరేటర్ మెట్టు కుమార్

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యమని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు స్పోర్ట్స్ యూనిఫామ్ కోసం తన వంతు సాయంగా రూ.25 వేల అందజేశారు.ఈ సందర్భంగా హెచ్‌ఎం స్పందన చౌదరి కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఈటీ గౌసుద్దీన్, ఉపాధ్యాయులు నరసింహులు, స్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీడ్కోలు



ప్రిన్సిపాల్ రాంప్రసాద్‌ను సన్మానిస్తున్న విద్యార్థులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల ప్రభుత్వ తెలంగాణ మోడల్ పాఠశాలలో బదిలీపై వెళ్లిన ప్రిన్సిపాల్ రాంప్రసాద్, ఉపాధ్యాయులను శుక్రవారం విద్యార్థులు, పూర్వవిద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు సన్మానించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన ప్రిన్సిపాల్ రాంప్రసాద్ మాట్లాడుతూ అందరి సహాయ సహకారాలతో పాఠశాలను ఎంతో అభివృద్ధి చేశామన్నారు. 11 ఏళ్లుగా ఇక్కడ పని చేయడం తన అదృష్టం అని తెలిపారు. పదో తరగతి, ఇంటర్‌లో మంచి ఫలితాలు సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచామన్నారు. విద్యార్థులు జీవితంలో మంచిగా స్థిరపడినప్పుడే తమకు, తల్లిదండ్రులకు ఎంతో ఆనందంగా ఉంటుందన్నారు.

డివిజన్ అధ్యక్షుడిగా విజయ్‌భాస్కర్



అధ్యక్షుడు
విజయ్ భాస్కర్‌గౌడ్



ప్రధాన కార్యదర్శి
మల్లేశం

హత్నూర(సంగారెడ్డి): తెలంగాణ విద్యుత్ ఆరిజన్ కన్వర్షన్ జాయింట్ యాక్షన్ కమిటీ(టీవీఏసీ జేఏసీ) హత్నూర సెక్షన్ జోగిపేట సబ్ డివిజన్ నూతన కమిటీ అధ్యక్షుడిగా విజయ్ భాస్కర్ గౌడ్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా మల్లేశంలను అందరి సమక్షంలో ఎన్నుకున్నారు.

మరమ్మతులకు నోచుకోని సిగ్నల్స్

సంగారెడ్డి క్రైమ్: జిల్లా హెడ్ క్వార్టర్‌కి వ్యవసాయదారులు, విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు, రాజకీయ నాయకులు తమ పనుల కోసం రోజూ వస్తారు. పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా ట్రాఫిక్ సిగ్నల్స్‌ని కనీసం మరమ్మతులు కూడా చేయించడం లేదు. దీంతో ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కలెక్టరేట్ ఆవరణలో, ఎస్పీ కార్యాలయం పక్కనే ఉన్న సిగ్నల్స్ కూడా పనిచేయడం లేదని వాహనదారులు వాపోతున్నారు. అలాగే ఐటీఐ కళాశాల బస్టాండ్ దగ్గర ఉన్న సిగ్నల్స్‌ను కూడా అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ధ్రువపత్రాల అందజేత



నారాయణఖేడ్ ధ్రువపత్రాలను అందజేస్తున్న సంగ్రాంమహరాజ్

నారాయణఖేడ్: గత నెల రోజులుగా నిర్వహించిన పీఎం విశ్వకర్మయోజన శిక్షణాకార్యక్రమం ముగిసింది. ఖేడ్ ప్రాంతానికి చెందిన 200 మంది శిక్షణ పొందారు. గురువారం శిక్షణాకేంద్రంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో శిక్షణ పొందినవారికి అఖిలభారత సాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి, కొండాపూర్ హనుమాన్ ఆశ్రమపీఠాధిపతి సంగ్రాంమహరాజ్ తన చేతుల మీదుగా ధ్రువపత్రాలను అందజేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణ, నియోజకవర్గ కన్వీనర్ రజనీకాంత్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యులు సాయిరాం, శిక్షకులు సూర్యవంశీ, శ్రావణ్‌మార్, సాయిచంద్రశేఖర్, సంతోష్, స్వర్ణకార సంఘం అధ్యక్షులు సత్యంచారి, రాష్ట్ర నాయకులు బీబీపేట రవిచారి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సీజనల్ వ్యాధులపై వైద్య శిబిరం

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం ఖాజపూర్‌లో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.దీంతో సిర్గాపూర్ పీహెచ్‌సీ డాక్టర్ ప్రతిభ ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య పరీక్షలు జరిపి.. జ్వరం, దగ్గు, జలుబు, ఇతర కారణాలతో బాధపడుతున్న 20 మందికి వైద్య సేవలు అందించినట్లు డాక్టర్ ప్రతిభ తెలిపారు.

◆ ఏడుగురికి జరిమాన

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఏడుగురు వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు రూ. 2 వేల చొప్పున జరిమాన విధించింది. ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో ఏడుమంది వాహనదారులను పట్టుకున్నట్లు చెప్పారు. శుక్రవారం కోర్టులో హాజరు పరుచగా.. న్యాయమూర్తి పై జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

◆ చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మునిపల్లి(అందోల్): ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బుదేరా ఎస్ఐ రాజేశ్ నాయక్ శుక్రవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. 19వ తేదీన మండలంలోని గార్లపల్లి గ్రామానికి చెందిన మన్నె మొగులయ్య (36) పొలంలో పురుగుల మందు తాగాడు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పడంతో వెంటనే పొలం వద్దకు వెళ్లారు. అప్పటికే అపస్మారక స్థితిలోకి వెళ్లిన అతడిని సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పేర్కొన్నారు.

◆ క్రీడాదుస్తులు పంపిణీ

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలపరిధిలోని నిజాంపూర్ ప్రభుత్వ పాఠశాల నుంచి జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన 40 మంది విద్యార్థులకు శుక్రవారం మాజీ ఎంపీటీసీ మాధవరెడ్డి క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. వీరు క్రీడల్లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కరుణాకర్, సొసైటీ డైరెక్టర్ విఠల్ రెడ్డి, నాయకులు రమేశ్, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ దుండగులను కఠినంగా శిక్షించాలి

హత్నూర(సంగారెడ్డి): అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలని మాలల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు బొమ్మల మైసయ్య, కాసాల విట్టల్ డిమాండ్ చేశారు. శుక్రవారం హత్నూర మండలం దౌల్తాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. శివ్వంపేట మండలం కొంతాన్‌పల్లి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం నాయకుల విగ్రహాల రక్షణ కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు పూర్తి అయిపోయినా దేశంలో నేటికీ కుల వివక్ష తగ్గలేదని ఏఐఎస్ఎస్‌డీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింగ్ రాజ్ అన్నారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం సిగ్గుచేటన్నారు.

◆ నాలా పనులు పరిశీలన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని అశోక్‌నగర్, జ్యోతినగర్‌కాలనీల మధ్యలో నిర్మిస్తున్న నాలా నిర్మాణ పనులను శుక్రవారం స్థానిక కార్పొరేటర్ పుష్ప పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలను తప్పకుండా పాటించాలని కోరారు. లేనిపక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

◆ నిర్మాణాలకు అనుమతి తప్పనిసరి

కంది(సంగారెడ్డి): ఇళ్ల నిర్మాణాలకు గ్రామ పంచాయతీ అనుమతి తప్పకుండా తీసుకోవాలని ఎంపీఓ మహేందర్ రెడ్డి సూచించారు. శుక్రవారం కందిలోని లక్ష్మీనగర్‌లో అనుమతి లేకుండా నిర్మిస్తున్న కట్టడాలను పంచాయతీ అధికారులు అడ్డుకున్నారు. అనంతరం ఎంపీఓ మాట్లాడుతూ పంచాయతీ అనుమతి లేకుండా నిర్మాణాలను చేపడితే కూల్చి వేస్తామని హెచ్చరించారు. లక్ష్మీనగర్‌లో మురికి నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి విద్యాధర్ గౌడ్‌కు సూచించారు.

◆ నేడు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నారాయణఖేడ్: ఖేడ్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈనెల 21న శనివారం ఉదయం 11 గంటలకు ఖేడ్, మనూరు, నాగలి గిద్దా మండలాల లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన ఆర్థికసహాయం చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు క్యాంపు కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి తన చేతుల మీదుగా చెక్కులను అందజేస్తారని పేర్కొంది.

◆ అక్రమ కట్టడాలను తొలగించాలి

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని నాలాలను కబ్జా చేసి నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించాలని సీపీఐ డివిజన్ కార్యదర్శి నర్సింలు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో గల నాలాలు, ప్రభుత్వ స్థలాల్లో కొంతమంది ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారన్నారు. మురికి నీరు ప్రవహించే నాలాలు కబ్జా వల్ల కనుమరుగయ్యాయని, కొద్దిపాటి వర్షానికి రోడ్లు జలమయమవుతున్నాయని వాపోయారు. మురికి కాల్వలపై కూడా నిర్మాణాలు చేపట్టడం వల్ల మురుగు నీరు కూడా వెళ్లని పరిస్థితులు ఉన్నాయన్నారు. భవానీ మందిరం రోడ్డులో అక్రమ నిర్మాణాలు తొలగించి రోడ్డు విస్తీర్ణం చేస్తామని చెప్పిన అధికారులు పట్టించుకోవడంలేదని వాపోయారు.

చెత్త వేస్తే చర్యలు తప్పవు

సాక్షి కథనానికి స్పందించిన అధికారులు

సంగారెడ్డి: ఎవరి చెత్తకు వారే పరిష్కారం చూసుకోవాలని అధికారులు పేర్కొన్నారు. సంగారెడ్డి మండలం ఫసల్వాది శివారులో 'చెత్తతో చింత' పేరిట శుక్రవారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి జిల్లా పంచాయతీతో పాటు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు స్పందించారు. శుక్రవారం డీఎల్పీఓ అనిత, ఎంపీఓ సువర్ణ, పంచాయతీ కార్యదర్శిని తమ వెంట తీసుకుని బీర్ ఫ్యాక్టరీకి వెళ్లారు. పంట పొలాల్లో బీరు ఫ్యాక్టరీ వ్యర్థాలు ఎలా పడేస్తున్నారు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రం లోపు శుభ్రం చేయాలని ఆదేశించారు. మళ్లీ అక్కడ చెత్త వేయకుండా కమిటీ ఏర్పాటు చేయాలంటూ సూచించారు. అలాగే స్థానిక పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు స్పందించి సంఘటన స్థలానికి వెళ్లారు. ఫ్యాక్టరీకి చెందిన కాంట్రాక్టర్, ఇతర సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే పంట పొలాల్లో చెత్త వేస్తున్నట్లు వారు గుర్తించినట్లు తెలిపారు. దీనిపై తగిన చర్యలు తీసుకుంటామని వివరించారు.